**నిరాశావాదికి నిప్పచ్చరంగానూ, ఆశావాదికి పచ్చపచ్చగానూ కనిపిస్తుంది జీవితం. అయితే, నిరాశావాదిలో ఆత్మాశా, ఆశావాదిలో అరాచకమూ వుండటం ఆశ్చర్యం కలిగించదూ?**


# ఆశావాది
## పాటుంకి సుబ్రమణ్యం

**పొడవైన ఓ పట్టీ తయారుచేసి, అందులో వివరాలు వ్రాస్తూ పాత ఫైల్సు గట్రా రికార్డు సెక్షనికి పంపించివేసే ఉద్యమంలో మునిగి ఉన్నాం. ఇటువంటి పని, ఇంతటి భారీయెత్తున చేయడం కొత్తకావడాన మొదట్లో సంకోచపడ్డాను, తత్తరపడ్డాను.**

చివరకు చేసేదిలేక ధూళి ముక్కు పుటాలగుండా పోకుండా వుండేందుకు చేతి రుమాలు ముక్కుకి అడ్డంగా కట్టుకొని మునురువంటి ధూళిలోకి ఉరికాను. అదిమూసి కొల్లర్కులు తొలుత రెండుమూడుసార్లు "టార్జన్" అంటూ, మరేదో అంటూ ఛలోక్తులు విసరినా, నేనేమాత్రం చలించక పోవడం చూసి విసుగెత్తి వూరుకున్నారు. మరో యిద్దరు నన్ను అనుసరించారు కూడాను.

చాలా కాలంనుంచీ యిరుకుగావున్న రికార్డు సెక్షన్ని మొన్ననే విశాలంచేసి, దాని ప్రక్కనే వున్న ఖాళీ స్థలంలో మరో కొత్తది కట్టించి, అంతవరకూ చెరొక మూలా పాముల పుట్టలా పేరుకొని పోగయిన పాతఫైల్సు నన్నిటినీ అక్కడికి తక్షణం చేర్పించమని ఆఫీసు ఆర్డరొకటి ఆఫీసునంతటినీ ఊపిపారేసింది. అప్పటి నుంచీ మాకదే పని. బల్లమీద ధూళి — రాక్ మీద ధూళి — కడకు ఒంటి మీద, కంటి మీద కూడా ధూళిమయంగా తయారయింది. ఆదిలో ఎంత ఉద్వేగ పూరితంగా ఈ పనికి పూనుకున్నామో — రానురాను అంత నరకయాతనగా తయారయింది.

ఇంతటి గంద్రగోళంలోనూ - అతలా కుతలమైపోతూన్న ఇటువంటి పరిస్థితిలోనూ మా సెక్షన్ ప్యూను నారాయణుడిని ఓ కంట కనిపెడ్తూనే వున్నాను. నారాయణుని చూస్తుంటే మనసు కరగుతూంది. మొన్న మొన్నటివరకూ అతగాడికి ఆఫీసరు రూములోనే పని. అతడు ఆఫీసరురూముకి అటాచ్ చేసి ఉండగా అతడి ఉల్లాసాన్ని కనులార చూసే అవకాశం కలిగింది. ఆఫీసరు రూము నుంచి ఫైలుని ముద్దువచ్చే చంటాడిని చంకన పెట్టుకున్నట్టు అదిమి పట్టుకొని సన్నటి ఈలవేస్తూ వెళతాడు. ఫైలుని సాఫీగా హెడ్‌క్లర్కు బల్లపైన గిరాటువేసి, ఓసారి అలవోకగా కాకీషర్టు సర్దుకొని, మధ్యన విడిచిన ఈలను పసందుగా అందుకొని, ఠీవిగా ఆఫీసరు రూము ముందు ద్వారపాలకుడిలా కూర్చుంటాడు. పాపం అతడు కష్టకాలం తుపానువంటి ఓ మేజర్ షఫ్లింగులో చిక్కుకొని మా సెక్షన్‌లో వచ్చి పడ్డాడు.





మూటలు మోసి మోసి నడుం నొప్పి పెట్టిన మా నారాయణుడు మూటను భుజం మీదికి ఎత్తుకునేటప్పుడల్లా ఒక్క మూలుగు మూలిగి "ఇప్పుడుగాని ఒక ప్లేటు పాయా, ఏకబిగిని మూడు ఆమ్లేట్లుగాని తీసుకుంటే- హా! ఒంటికెలాగుంటది?" అని మననం చేయడం రాగాలాపనగా తయారయింది. అతని పరిస్థితి మాకు అర్థమయింది. ఆ రెండు పదార్థాలతోబాటు అతడు తీసుకోవడానికి అర్రులు చాచేది మరొకటి ఉన్నది. సిగ్గు కాస్త, భయంకాస్త అడ్డువచ్చి అది బయట పెట్టలేదు.


* * *

"మనం ఇంత సిన్సియర్‌గా కష్టపడుతున్నాం గాని—ప్చ్, ఏం లాభం?" ఫైల్సు

పేర్చి పెట్టి వ్రాసుకుంటూన్న వాడినల్లా తల పైకెత్తి చూశాను. మా హెడ్‌క్లర్కు తీరుబడిగా మా మధ్యకు వచ్చి నిలుచున్నాడు. అతడే ఉద్దేశ్యంతో ఆ మాటలన్నాడో అందరికీ తెలుసు. వాస్తవానికి ఇంత మలినమయంగా తయారయిన సెక్షన్‌లో అతడు చేయవలసిందేమీ లేదు. హాయిగా క్యాంటీను వేపో పాత సహచరుల సెక్షన్‌లకో వెళ్ళి, పిచ్చాపాటీలో పకి కాలం వెళ్ళబుచ్చవచ్చు. కాని అతడి ఉనికిని మేం మరవడం అతడు భరించలేడు. మేం అతడి ఉనికిని మరచినా మా వునికిని అతడు మరవడు. మమ్మల్ని మరవనివ్వడు. మా జవాబుకోసం ఎదురు చూడకుండానే అతడు మళ్ళీ ఏది అందుకుంటాడో మా కందరకూ సువిదితం.



"వెధవ గుమాస్తా బ్రతుకు! ఏముందని? ఇంతా కష్టపడి రేపు రిటైర్ అయేసరికి చేతిలో ఏమి మిగులుతుందని—నథింగ్. ఐ డేర్ ఎనఫ్ టు సే- నథింగ్!" తనతో మాటలు కలుపుతానని నా ముఖంలోకి తేరిపార చూశాడుగాని; నేను చప్పున తల దించుకొని ముఖంమీది రుమాలు ఓసారి సర్దుకొని, లేని దగ్గు ఓసారి తెచ్చిపెట్టుకొని నా పనిలో లీనమయాను. నాతో ఇక లాభం లేదనుకొని మూడవ సీటులో ఓ ముఖ్యమైన పాత ఫైలుని తనే తొందరగా కట్టుకుంటున్న రాజగోపాలం దగ్గరకు వెళ్ళి నిలుచున్నాడు హెడ్ క్లర్కు. సర్వ సాధారణంగా ఇటువంటి ఛాన్సు రాజగోపాలం ఎప్పుడూ విడిచి పెట్టుకోడు. ఒకేసారి— పదిమందితో పదిరకాల టాపిక్సు గురించి ధారాళంగా అనర్గళంగా మాట్లాడగల సమర్థుడు వాడు. ముఖ్యంగా హెడ్‌క్లర్కుతో మాట్లాడేటప్పుడు ఓ విధమైన స్వేచ్ఛాభావం కలగడంవల్ల ముమ్మరంగా సంభాషణలో పాల్గొంటాడు. ఆ తరవాత సాయంత్రం ఓ గంట పర్మిషన్ తీసుకుని వెళ్ళిపోతుంటాడు. కాని ఈసారి అతడా అవకాశాన్ని చేజిక్కించుకోలేదు. మూడురోజులుగా ఫూళిలో కొట్టుమిట్టాడుతూన్న వాడి ప్రాణం మునుపటి వేగాన్ని, సంభాషణయందున్న ప్రీతినీ పోగొట్టుకుంది. వయసులో ముమ్మరంగా వేటసాగించి,




'మృగరాజు', 'శాస్త్రీయ వేటగాడు' అన్న మహత్తరమైన బిరుదుల్ని పొందిన సింహం కాలపురుషుని కబంధ హస్తాలలో చిక్కుకున్న తరవాత చూసే దీనమైన చూపొకటి విసిరి తల దించుకున్నాడు. వాణ్ణి చూసి బిగ్గరగా నవ్వాలనిపించింది. కాని అప్పుడప్పుడే ప్రారంభమవుతూన్న సన్నటి తీక్షణమైన తలనొప్పి ఆ పని చెయ్యనివ్వకుండా ఆపింది. మా హెడ్ క్లర్కు తన ప్రయత్నం నుంచి విరమించలేదు.

"ఈ కాలపు పిల్లకాయల్నిగాని నమ్మి కొంచెం అజాగ్రత్తగా ఉన్నామా, మన పని అంతే! పెళ్ళాం కానివ్వండి. స్వంత బిడ్డలు కానివ్వండి. మన చేతిలో రెండు పైసలు వున్నంతవరకే మర్యాద! ఆ తరువాత...."

నిశ్శబ్దం.

"ఇప్పుడు నూరు రూపాయలకు దొరుకుతూన్న వస్తువులు మూడు సంవత్సరాల తరవాత మూడు వందలిచ్చినా దొరకవు. అంత దూరం ఎందుకూ — మూడేళ్ళ క్రితం ఓపెన్ మార్కెట్టులో దొరికిన కిలోబియ్యం ఖరీదు రూపాయిన్నర. మరిప్పుడో?" అతడు చెప్పేదాంట్లో కొత్త విషయమేదీ గోచరించదు. మార్పుకోసం మాత్రం వొక్కొక్కసారి నూరు దగ్గర పది, బియ్యానికి బదులు చింతపండూ జోడించి చెప్పుతుంటాడు.

ఇప్పుడతడు చెప్పడం ఆపుచేశాడు. ఎంతకూ అతడి దారిలో మేం పడకపోవడం గమనించి విసుగెత్తి వుండవచ్చు. అతడి ముఖంలోని భావాలను చదవాలనిపించి తల పైకెత్తాను. అంతలో పీక్కుపోతూన్న చేతుల్ని గట్టిగా విదిలించుకుంటూ నారాయణుడు ప్రవేశించాడు.

"ఇప్పుడుగాని ఒక్క ప్లేటు పాయా—ఒకే ఒక ప్లేటు తీసుకుంటే. నా సామిరంగా భలే భేషుగా ఉంటుంది సార్! ఒక మాట కాదు మూడు మాటలు ఒకేసారి ఎత్తిపారేస్తాను" మా హెడ్ క్లర్కు బొమముడితో నారాయణుడివేపు అదోలాచూడడంగమనించాను. ఈసారి నారాయణుడి పైన చిరెత్తు కొచ్చింది. ఒంటినొప్పులవల్ల ఇతగాడు సమస్తమూ మరచిపోయేటట్టు ఉన్నాడు. మా హెడ్‌క్లర్కు, శాకాహారని ఇంటా బయటకూడా తెలుసు. ఆయనముందు మాటిమాటికీ "పాయా" అని మననం చేయడం నాకు నచ్చలేదు.

"రిటైరు అయితేనేగాని ఈ బాడీకి రెస్టు దొరకదు"— అక్కసుగా ఆ ఒక్కమాటా అని ప్రక్కనున్న ఫైలు మూటపైన కూర్చున్నాడు. మరుక్షణం మా హెడ్‌క్లర్కు ముఖాన తాండవమాడుతూన్న అసహనం, నిరుత్సాహం మటుమాయమయాయి.

"నీ ముఖం! రిటైర్ అయిన తరవాత మన గతి ఇంతకంటే ఘోరంగా తయారవుతుంది తెలుసా?" నారాయణుడి పలుకుల్లోని జ్ఞానశూన్యతను ఎత్తి చూపుతూ అతడు బిగ్గరగా నవ్వాడు. నారాయణుడు తృళ్ళిపడి, చటుక్కున లేచి నిలుచున్నాడు- హెడ్ క్లర్కు ముందు కూర్చోవడం పొరపాటని గ్రహించి.

"ఏం సార్, ఎంతకాలం సార్ మనం ఇలా ముక్కుతూ మూలుగుతూ తిప్పలు పడటం?"

"డోంట్ బి ఎ ఫూల్! రిటైర్ అయిన తరవాత ఇప్పటిలాగే జాలీగా హోటల్సన్నీ తిరగగలననుకుంటున్నావా? ఇప్పుడు నిన్ను నమ్మి ఎవడైనా ఓ పది రూపాయలు అప్పు యిస్తాడు. రేపు అది కూడా చిక్కదు. అసలు నిన్నెవరు అక్కర చేస్తారు? చివరకు నీ బిడ్డలే నిన్ను చూస్తారని గ్యారెంటీగా చెప్పగలవా?" నారాయణుడి ముఖంలో కనిపించిన వెలవెలబాటుని చూసి, కణతల్ని నొక్కుకుంటూనే చిన్నగా నవ్వుకున్నాను. ఇప్పుడు నారాయణుడికి మౌనమే శరణ్యమైంది. ఎప్పుడూ దేనికోసమూ ఆలోచించేందుకు శ్రమ పడకుండా కాలాన్ని దూసుకుపోయే నారాయణుడు ఇప్పుడు ఆలోచనలోపడ్డాడు. "రేపు" అన్న పంజరంలో పదిలంగా దాచుకున్న 'నమ్మకం' అన్న పంచరంగుల చిలక ఒక్కసారి ఎగిరిపోవడం నారాయణుడు భరించలేక పోతున్నాడు. ఈ ఒక్క కారణంవల్లనే మొదటినుంచీ మా హెడ్ క్లర్కంటే ఓ విధమైన అయిష్టం ఏర్పడింది. అతడికి జీవితమందు ఏర్పడ్డ అపనమ్మకాన్ని నలువైపులా పరచడానికి ప్రయత్నిస్తాడు.

"ఇప్పుడు నీ 'పే' ఎంత?" నారాయణుడి అంతు తేల్చుకోకుండా విడిచిపెట్టేటట్టు లేదు మా హెడ్ క్లర్కు.

"మూడు వందల ఎనభై."

"అదికాదోయ్. నీ బేసిక్ పే అడుగుతున్నా."

"రెండు వందల పది."

"ఏడాదికి ఐదు రూపాయల చొప్పున రిటైర్ అయేసరికి మూడు వందల బేసిక్ పే అందుకుంటావు. ఆ మూడు వందలకీ ముప్పైఆరు శాతం డియర్‌నెస్ పే జోడించు. నాలుగు వందల ఎనిమిది రూపాయలవుతుంది. అందులో సగం- అంటే రెండు వందల రూపాయలు పెన్షన్ అన్న మాట. అదీను ముప్పైమూడు సంవత్సరాల సర్వీసు తరువాతనే! దీనితో మనిషి రిటైర్డు జీవితాన్ని ప్రశాంతంగా సాగించగలడని నువ్వు నమ్ముతున్నావు— మమ్మల్ని నమ్మమంటున్నావు. అవునా?"

హెడ్ క్లర్కు వేస్తున్న ప్రశ్నలు నా గుండెపై సమ్మెట పోట్లలా తగులుతున్నాయి. భగవంతుడి కృప ఒక్కొక్కరి విషయంలో ఒక్కొక్క విధంగావుంటుంది. అతడికి వరసగా నలుగురు కూతుళ్ళు. వారసుడు లేకపోయాడనే వేదన అతడి గుండెపై బరువై పేరుకొంది. అతడిలోని వేదననూ — ఊపి పారేస్తూన్న భయాన్నీ తోటివారికి పంచిపెట్టాలన్న తాపత్రయమా? ఏమో?

ఇప్పుడు తోటి ప్రభుత్వోద్యోగులు పని చెయ్యడం ఆపి, అతడి వేపు చెవులు రిక్కించి వింటున్నారు. అతడి పలుకు మాటున ఎటువంటి ఉద్దేశ్యం దాగివున్నా—

అతడు వేసే ప్రశ్నలకూ ప్రభుత్వోద్యోగుల జీవితానికీ అవినాభావ సంబంధం వుందనడంలో ఇసుమంత సందేహానికి కూడా ఆస్కారం లేదు.

"ఇంతకీ ఎంత పెన్షన్ దొరికితే రిటైరు జీవితాన్ని నెమ్మదిగా గడపగలమంటారు?" కణతల్ని నొక్కుకుంటూనే అడిగాను. రేపటి గురించిన భయం బ్రహ్మచారులను మాత్రం విడిచిపెడుతుందా?

"ఆఁ, అడిగావూ! అక్కడాగు—ఇప్పుడు నా జీతం ఎంత? అంటే మొత్తం జీతం—ఆరు వందలయాభై. ఇప్పుడు నాకు ఓ స్వంత యిల్లు లేదు. మండిపోతూన్న ధరల వల్ల కుటుంబం గడపడం ఇప్పటికే ఇబ్బందిగా వుంది. ఇంకొక పదేళ్ళ తరవాత. అంటే రిటైర్ అయేటప్పటికి ఏడు వందలయాభై అవుతుంది. అదే సమయాన ఒకటి గుర్తుంచుకోవాలి. ఈ పదేళ్ళలోనూ ద్రవ్యోల్బణం వల్ల నా జీతం డబ్బుల విలువ కూడా తగ్గిపోతూంది. అయినా నేను ఎక్కువ ఆశించడంలేదు. నేను రిటైరు అయేసరికి ఆఖరుసారిగా నా చేతికందిన జీతం నాకు ప్రతినెలా పెన్షన్‌గా దొరకాలి. అప్పుడుగాని నిజమైన ప్రయోజనం ఉండదు". 'రామచంద్రా! ఇంత పెద్దమొత్తాన్ని ఏ ప్రభుత్వం మాత్రం పెన్షన్‌గా ఇవ్వగలదు! అసలే మనది బీద దేశం—అప్పుల దేశం' మనసులో అబ్బురపడ్డాను.

"మీరు కోరేది చాలా ఎక్కువ సార్! మనం రిటైర్ అయేసరికి మనం కట్టిన ప్రావిడెంటు ఫండు చేతికి దొరుకుతుందిగా! దానికితోడు గ్రాట్యుటీ కూడా దొరకుతుందిగా!" తన అభిప్రాయాన్ని వినమ్రత వుట్టిపడేలా వెల్లడించాడు నారాయణ.

"అలాగా! ఇప్పుడు నే నడగబోయే ప్రశ్నలకు నిదానంగా ఆలోచించి బదులియ్యి. ప్రావిడెంటుఫండు 'లోను' తీసుకున్నావా?"

"తీశాను."

"క్రెడిట్ సొసైటీలో అప్పు."

".... .... ...."

"ఫెస్టివల్ అడ్వాన్సు."

".... .... ...."

"ఆడగడం మరచాను. ప్రతి ఏడాది ఇన్‌స్టాల్‌మెంటు పైన గుడ్డలు కొంటున్నావా?"

".... .... ...."

"ఇప్పుడు ఆఖరిసారిగా ఒక ప్రశ్న వేస్తున్నాను. వీటిని తీర్చేసిన తరవాత మళ్ళీ తీయవా?"

మా అందరివేపూ బేలగా ఓ నవ్వు నవ్వి తలదించుకున్నాడు నారాయణుడు.

"ఇందులో మన మందరమూ గమనించవలసిన ఓ ముఖ్యమైన విషయంవుంది. ఇన్ని చోట్ల యింతింత పెద్ద మొత్తాలు మనం అప్పు చేశాం. ఇంకా తీస్తూనేవుంటాం. దీనినే డెఫిసెట్ బడ్జెటు అంటారు. ఇటువంటి డెఫిసెట్ బడ్జెట్‌తో కాలమంతా గడిపినవారికి ఉద్యోగ విరమణ అనంతరం చేతిలో చెప్పుకోతగ్గ మొత్తం మిగులుతుందని మీరు నమ్ముతున్నారా?"

* * *

ఆ రోజు కాఫీ తీసుకున్న తరవాత చాలాసేపు క్యాంటీనులో కూర్చుండి పోయాను. ఇద్దరు ముగ్గురితో మాటలు కలిపానన్న మాటేగాని, ఎందుకు మాట్లాడాను ఏమి మాట్లాడాను అన్నది గుర్తులేదు. నా మనసు వెలితిగా, ఎండిపోయిన బావిలా తయారయింది. మా రవిగాడు పి. యు. సి. ప్యాసయిన తరవాత తనను బి. ఎస్‌సి. చదివించమని అప్పుడే ఇంట్లో పోరు ప్రారంభించాడు. వాడికోరిక విని నాన్నగారు మండిపడ్డారు.

"పెండ్లీ పెడాకులూ లేకుండా వాడు ఎంతకాలంరా మిమ్మల్ని చదివించగలడు? చదివింది చాలు, వాణ్ని ఓ యింటివాణ్ని అవనివ్వండి." వాడు కండ్లనీరు నింపుకొని వెళ్ళడం గమనించి, "నాన్నగారు అలాగే అంటారు. బాగా చదివి క్లాసు తెచ్చుకున్నావంటే కాలేజీలో సీటుకోసం ప్రయత్నిస్తాలే" అని ఊరడించి పంపించాను. ఆ మాటలన్నీ జ్ఞప్తికివచ్చి, ఇప్పుడు గుండెలో బరువు దిగసాగింది.

మిగిలిన రెండు ఎకరాల మాగాణీ తెగ నమ్మి, మొన్ననే చెల్లి పెండ్లి జరిపించాం. పచ్చటి కొమ్మలా పెరుగుతూన్న నిర్మల ఉండనే ఉంది. నాన్నగారికి వచ్చే పెన్షన్ ఏ మూలకు? ఇది చాలదని మూడు నెల్ల నుంచీ ఏదో ఒక సంబంధం చూసి ఒప్పుకోక తప్పదని అమ్మానాన్నా ఓ పట్టాన విడిచిపెట్టడం లేదు. పెండ్లి గురించి తలపోస్తే భయం కలిగేది. ఇప్పుడు వణుకు కూడా ప్రారంభమయింది.

నాకు తలనొప్పి ఆపుకోలేనంతగా అధికమైంది. సెక్షన్‌లో కాలు పెడితే అది మరింత అధికమవుతుందేగాని తగ్గదు. అరపూట సి. ఎల్. ఎప్లయ్ చేసి, ఇంటి ముఖం పట్టాను.

* * *

మరునాడు ఉదయం సీట్లో ఆసీనుడనవక ముందే, అమితమైన ఆశ్చర్యంతో గుడ్లప్పగించి చూస్తూ నిలుచుండిపోయాను. దిగంతాలలో దూసుకుపోయే దూదిపింజెమల్లే, వ్యోమగామిలా నడుస్తూ అందరివద్దా ఫైల్సు మూటలను అడిగి పసందుగా భుజంపైన వేసుకుంటూన్న నారాయణుడినిచూసి ఓ క్షణంపాటు నివ్వెరపడి ఆ తరవాత పరధ్యానంగా కూర్చున్నాను. నిన్నటి వాగ్వివాదం మరచి పోయాడా? నిన్నటి దిగులును, గుబులును యింత త్వరలో ఎలా మరవగలిగాడు?

ఈ రోజతడు శుభ్రంగా కనిపిస్తున్నాడు. గెడ్డం నున్నగా గీసుకొని, మీసపుకట్టు, సైడ్ బర్న్స సరిదిద్దుకున్నాడు. కొత్త యూనిఫామ్ వేసుకున్నాడు. అతడు రికార్డు సెక్షన్‌కివెళ్ళి వచ్చిన తరవాత దగ్గరకు పిలిచాను.

"విశేషం ఏమైనా ఉందా? ఖుషీగా కనిపిస్తున్నావు." నా ప్రశ్నవెనుక వున్న భావాన్ని అతడు వెంటనే గ్రహించాడు.



"మీరేమైనా అనుకోండి. మన హెడ్ క్లర్కు ఊరికే భయపడుతున్నారు సార్! నేను చచ్చినాసరే. ఆయనలా భయపడుతూ కూర్చోను సార్! ఉంటే తింటాను. లేకపోతే చల్దన్నం తిని పడుంటాను. అంతేగాని భయపడి ఏం సాధిస్తాం సార్? నిన్న సాయంత్రం ఇరవై రూపాయలు అప్పు తీసుకొని తిన్నగా హోటల్‌కి వెళ్ళాను. ఒక ప్లేటు బిరియానీ తిన్నాను. రెండు ప్లేట్లు బిరియానీ పొట్లం కట్టి ఇంటికి తీసుకు వెళ్ళాను. కాలం ఎప్పుడూ ఒక్కలాగే ఉంటుందా సార్? మనకూ మంచి రోజులు రాకమానవు. గాంధి మహాత్ముడు పుట్టి మనకు స్వతంత్రం ఇప్పించాడు. అటువంటివాడు మరొకడు పుట్టి మన కష్టాలను తీర్చకుండానే పోతాడా? అవును గానీ. నిన్న మాటల్లోపడి అడగడం మర్చిపోయాను సార్! "పే" కమిషను నియమిస్తారటగా?"

"అవును. దానిని ప్రకటించేందుకు ఒక ఏడాది. దానికి ఛైర్మన్ను వెతికేందుకు మరొక ఏడాది. రిపోర్టుని పరిశీలించి ప్రభుత్వం ఎంతవరకు అంగీకరిస్తుందో తెలుసుకోవడానికి మరో రెండేళ్ళు. ఫలితం అందేటప్పటికి...."

"పర్వాలేదు సార్! మెల్లగా రానివ్వండి సార్! ఒకరోజు వచ్చే తీరుతుందిగా! అప్పుడు మనకు అరియర్సు దొరక్కుండా పోతుందా? హెడ్ క్లర్కు చెప్పినట్లు మన పెన్షన్ కూడా కాస్తంత పెరుగుతుందిగా!"

అప్పుడే చేతికి లభించినంత ఆనందంతో నా బల్లపైన ఓ చరుపు చరిచి. పైలు మూటను భుజంమీదకు ఎత్తుకున్నాడు. ఎందుకో తెలియదు - అతణ్ణి చూసిన తరవాత— అతడి మాటల్ని విన్న తరవాత నాలోని నిరుత్సాహం పటాపంచలయింది. ఏదో స్వరం ఎక్కడి నుండో గాలి తెరల గుండా వచ్చి. నా గుండెలోకి ప్రవేశించి. ఇలా అంటుంది—"ఇది జీవితం. దీనిని అందుకో! చేతులు చాచి అందుకో!" అప్పుడే. ఆ క్షణానే ఓ తీర్మానానికి వచ్చాను- విజయనగరంవాళ్ళ సంబంధాన్ని ఒప్పుకున్నట్లు నాన్నకు ఈరోజే చెప్పాలి.

నారాయణుడూ కదులుతున్నాడు.

"నారాయణుడు!" భుజంమీది పైలు మూటను దించకుండానే- నా దగ్గరకు వచ్చి నిలుచున్నాడు.

"కాఫీ తెచ్చివ్వనా సార్?"

"కాదు. అంతా చెప్పావు. ఒక్కటి చెప్పలేదు. మాసం చివరన అడిగిన వెంటనే అప్పు ఇచ్చాడే — అతడెవరయ్యా? ఫ్రెండా?" నారాయణుడు సన్నగా నవ్వాడు.

"కాదు సార్ మన హెడ్‌క్లర్కు."

# కొత్త సామెతలు

పోయేవాడు భూదానంచేస్తే గెలిచేవాడు వాగ్దానం చేశాట్ట!
కేలిక్యులేటర్‌తో పరీక్షరాస్తే కంప్యూటర్ రిజల్ట్ యిచ్చిందట!
మంత్రిగారి రామాయణంలో— సీత రష్యా వెళితే శ్రీరాముడు సిలన్ వెతికాడు
పాత సుత్తితో కొత్త దెబ్బ
మామిడిపండు తిని పనస వల్లించేట్ట!
ఏడడుగులు వెయ్యాలంటే ఎనిమిది డ్యూయెట్లు తీయాలట!

—వి. బాచీరామం, విశాఖ-1

బూతులుతిట్టి బూర్లు పెట్టినట్టు.
కట్నమొద్దూ కారిమ్మన్నాట్ట.
సినిమామీద కోపం సీటుమీద చూపినట్టు.
కట్నమొద్దంటే కాలాంకరన్నార్ట.

—వి. మల్లికార్జునరావు, తెనాలి

"కందిపప్పు నిండుకుంది నాథా" అంటే "కాంధారికెళ్ళి భోంచేద్దాంపద" అన్నాట్ట.

—'నాన్సీ', గుడివాడ

బీరు తాగినప్పుడు "బ్రేవ్" అని బిల్లు చూసి "బేర్" మన్నాట్ట.
శుభం పలకవోయ్ సెక్రటరీ అంటే ప్రతిపక్షానికి పాతికవేలు మెజార్టీ అన్నాట్ట.

—సిహెచ్. కె. రాజు, అమలాపురం

కామెంట్రీ అంతా విని గవాస్కర్ ఎవరని అడిగినట్టు.

—ఎమ్. అంజనీప్రసాద్, ఏలూరు

ప్లాటుకోసం పాత పత్రికలు తిరగేసినట్టు.
నీ వోటువిలువ ఎంత అంటే నీ పర్సులోంచి వచ్చిన నోటంత అన్నాట్ట.

—మణిశ్రీ, కాకరపర్రు

అక్షరం రానివాడికి ఆలోచన లెక్కువ—చెత్త సినిమాకు పాటలెక్కువ అన్నట్లు.

—యం. అన్నపూర్ణ. నల్లగొండ

పత్రిక్కి ఉత్తరం వ్రాయలేనమ్మ— సినిమాకి కథ వ్రాస్తానందట.

—ఎన్. ఆంజనేయులు, కొరిసపాడు

మేపే గుమాస్తావచ్చి చేపే గుమాస్తాని చెడగొట్టినట్టు

—డి. మురళీకృష్ణ, మచిలీపట్నం

ప్రారంభ సంచికలోనే "లాస్టెస్ట్ సర్క్యులేషన్" అని ప్రచురించినట్లు.
ప్రతిపక్షాలమీది కోపం పత్రికలమీద చూపినట్టు.

—మేదేపల్లి శేషు, ఖమ్మం

దేవుణ్ణి గురించి పూజారికి లెక్చరిచ్చినట్టు.
జిర్ణిలో కొత్త వీక్లీ కొనడమెందుకు? పోయిందని ఏడవడమెందుకు?

—కె. ఎస్సెన్. వాసు, షక్కర్‌నగర్



మీ దినచర్య
టాన్‌టెక్స్®
తోనే ప్రారంభించండి
పగలు మొదలు రాత్రి వఱకు టాన్‌టెక్స్‌నే ధరించండి. దాని అమరిక, పొందిక మీ దినచర్య అందు ఎంతో తోడ్పడును.
మీకు ఖచ్చితంగా సరిపోతుంది టాన్‌టెక్స్
బ్రీఫ్‌లు • వెస్ట్‌లు • క్యాజువల్స్ • స్పోర్ట్స్ పిల్లల దుస్తులు
TANTEX
THE SEAL OF TANTEX QUALITY
Imageads-M- TT.1568 Tel